# ఆనందం

నాగులూ, జోగులూ పదో నెంబరు బస్సులో కలిశారు.

"ఎక్కడికోయ్, నాగులూ?"

"ఇక్కడికేనోయ్, నువో?"

"నేనూ ఇక్కడికేనోయ్. అందమైన బొమ్మలున్నాయిటగా?"

"ఉండకుండా ఉంటాయా?" అన్నాడు నాగులు, కొంచెంగా నవ్వి.

"నాకు బొమ్మలంటేనూ, దృశ్యాలంటేనూ చాలా ఇష్టం."

"ఎవరికుండదు?"

ఎగ్జిబిషను దగ్గర జోగులు దిగుతూ, "దిగవేం?" అన్నాడు.

"నేనా?" అన్నాడు నాగులు ఆశ్చర్యంతో.

జోగులు బస్సు దిగి ఎగ్జిబిషనులోకి పోయినాడు. తనివిదీర బొమ్మలు చాలాసేపు చూశాడు. చాలా పొద్దుపోయి అతను మళ్లీ బస్సు ఎక్కేసరికి మళ్లీ నాగులు తయారు.

"ఆహా, ఎంతమంచి ఎగ్జిబిషను! చూడకపోతివి" అన్నాడు జోగులు.

"పోనిస్తూ" అన్నాడు నాగులు.

"అదేమిటోయ్! అంత సౌదర్యం నీకెక్కడ కనిపిస్తుంది."

"బస్సులోనూ, రోడ్డుమీదా, ఎగ్జిబిషన్‌లోనూ నువేం చూశావు?"

"అందమైన బొమ్మలు."

"ఏమిటా అందం?"

"కంటికి చూడబుద్ధి అయేది; ఎంతసేపు చూసినా చూడబుద్ధి అయ్యేది; నవరసాలూ ప్రేరేపించేది."

"ఆపాటి అందమూ నేనూ చూశానులే."

"బస్సులోనా?"

"రోడ్డుమీద కూడా. మ్యూజియం దగ్గిర ఒక అమ్మాయి ఎక్కింది. రత్నమనుకో. నల్లగా నిగనిగలాడే జుట్టు, నొక్కులు నొక్కులుగా. చిన్ననోరు. పాలుగారే చెంపలు. పల్చగా ఒళ్లంతా కనిపించే చీర కట్టింది. ఎటువంటి అవయవ సౌష్ఠవం అనుకున్నావు? అదృష్టం,

నా పక్కనే కూచుంది. బస్సు మలుపులు తిరిగినప్పుడల్లా నా మీద విరుచుకుపడి వెంటనే సిగ్గుపడేది. సిగ్గుపడ్డప్పుడల్లా మొహం జేవురించేది. బొమ్మల మొహాలు జేవురించటం ఎన్నడన్నా చూశావూ... ? ఆ అమ్మాయి కావాలనే అట్లా నా మీద పడిందనుకుంటానోయ్. నేనాడవాళ్లకి అందంగా ఉంటా గామాలు."

"నీకు ఆర్టంటే తెలీదోయ్. ఆర్టు కళ. అది కళాకారులు చేసే ఆదర్శ సృష్టి. నిర్దుష్టంగా ఉంటుంది."

"చెప్పకోయ్, నీ ఎగ్జిబిషను బొమ్మలన్నిటి కన్నా ఆ అమ్మాయి లక్షరెట్లు నిర్దుష్టంగా ఉంది."

"ఇతర రసాలమాటేమిటి?"

"అన్నీ చూశా. నుంగంబాకం మలుపులో కారు ప్రమాదం - బీభత్సం. నాయరు రోడ్డు దగ్గిర ఒక తొంభై ఏళ్ల ముసలావిడ బస్సు ఎక్కుతూ మెట్లమీద పడింది. పాపం - కరుణ, పదో నంబరు బస్సును పాండీ బజారులోనుంచి పోనివ్వనందుకు ఒక ప్రయాణికుడు కండక్టరుతో పోట్లాట వేసుకున్నాడు - క్రోధం, ఆ మనిషి పానగల్ పార్కు దగ్గిర దిగి వెనక్కు నడిచి పోయినాడు - హాస్యం... ఏ రసం కావాలో కోరుకో."

"అయితే కళ వ్యర్థమంటావా?"

"నాకేం తెలుసునోయ్? నేనెప్పుడూ బొమ్మలు చూడను. నాకు బొమ్మలంటే కొంచెం ప్రెజుడిస్ ఉంది. మూడు రోజుల క్రితం వెల్లింగ్టను సినిమా దగ్గిర ఒక బేనరు చూశా. అందులో ఒకడు మరొకడి గొంతు ఉత్సాహంతో పిసుగుతున్నాడు. ఆ కళాయుతమైన హత్య ఎన్నటికీ పూర్తి కాదు. ఈవాళ మళ్లీ చూశా. ఆ తప్పుడు ముండాకొడుకు ఇంకా చావలేదు. రేపూ, ఎల్లుండీ, ఆవలెల్లుండీ, అటావలెల్లుండీ కూడా చూస్తా. నాకు తెలుసు, వాడు చావడు."

"ఉత్తమమైన చిత్ర కళకూ వెధవ సినిమా బొమ్మలకూ సాటి చెప్పటం భావ్యమేనుటోయ్?"

"రెండూ నా కళ్లకి చచ్చుగానే ఉంటయ్యోయ్!"

నాగులు పక్క సీటు ఖాళీ అయింది. అక్కడ కూచుందామని జోగులు వెనక సీటులోంచి నుంచి లేచాడు. ఇంతలో ఒక అమ్మాయి బస్సులోకి ఎక్కి ఒక క్షణంలో బస్సంతా కలయజూచి నిస్సంకోచంగా నాగులు పక్క కూచుంది.

జోగులుపడ్డ బాధ వర్ణనాతీతం. ఎందుచేతనంటే ఆ అమ్మాయికి నల్లగా నిగనిగలాడే జుట్టూ, రాళ్లను కరిగించే కళ్లూ, పాలు గారే చెంపలూ, వొళ్లంతా కనపడే చీరా ఉన్నాయి. కళాకారులంతా కలిసినా ఆ అమ్మాయి మూతిని చిత్రించలేరు. గాలికి రేగే ముంగుర్లను

పైకి తోసుకున్నప్పుడల్లా ఆమె వేళ్లూ - ఎంత నాజూకైనవి! - నాగులు భుజానికి తగులుతున్నాయి. బస్సు మలుపు తిరిగినప్పుడల్లా ఆ పిల్ల - సందేహం లేదు, కావాలనే - నాగులు మీదికి ఒరిగి సిగ్గుతో అతనికేసి చూస్తుంది.

ఎటూగాని పాయికడై దగ్గిర నాగులు దిగటానికి లేచాడు. ఆ పిల్లా లేచింది.

"వస్తానోయ్" అన్నాడు నాగులు.

జోగులు మాట్లాడలేదు.

"నాకు ఆర్టంటే అభ్యంతరం లేదుగాని, జీవితంలో లభించని ఏ సత్యమన్నా కళ ద్వారా లభిస్తే బొమ్మలు చూడటానికి నాకేమీ అభ్యంతరం లేదు" అంటూ నాగులు దిగిపోయినాడు.

ఆ అమ్మాయి నాగులు వెంటే పోతున్నదో, మరోదారిన పోతున్నదో చూద్దామంటే ఈలోపుగానే బస్సు మలుపు తిరిగిపోయింది.

***ముద్రణ : హంస మాసపత్రిక, జనవరి 1957***